సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం | 30 | జూన్ | 2025



'కొండా'కు దమ్ముంటే కొత్త పార్టీ పెట్టాలి - 8లో

ఎమ్మెల్యేలను తామే గెలిపించామని చెబుతున్న కొండా మురళికి దమ్ముంటే కొత్త పార్టీ పెట్టాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు.



ఇంటర్ లింక్‌తో నిరంతర విద్యుత్

విద్యుత్ అంతరాయాలతో వినియోగదారులు ఇబ్బందులు పడొద్దనే లక్ష్యంతో టీజీ ఎన్పీడీ సీఎల్ ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. - 8లో

గరిష్టం/కనిష్టం 31°/25°

వాతావరణం

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురుస్తాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి.

న్యూస్‌రీల్

టీచర్లకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



విద్యారణ్యపురి: టీచర్లకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సోమశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండలోని సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు ఆధ్వర్యాన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణతో అనేక పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఏర్పడిందని, భర్తీ చేసేందుకు వెంటనే బదిలీ లు, పదోన్నతులు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కరువుభత్యం విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు, ఉపాధ్యక్షులు వి.రాజారామ్, జ్యోతి, కార్యదర్శులు సీఎస్‌ఆర్.మల్లిక్, కె.సదా నందం, ఎం.ప్రసన్నానంద్, కె.శశిధర్‌రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.భాస్కర్‌రావు, బాధ్యులు ఎ.బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: మెరుగైన సేవలు అందించేందుకు ప్రయాణికుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈనెల 30న 'డయల్ యువర్ డీఎం' కార్యక్ర మం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. ఉదయం 11నుంచి 12గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, సంగెం, ఖిలా వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంత ప్రయాణికులు 89777 81103 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించడంతోపాటు, సలహా లు, సూచనలు ఇవ్వాలని ఒక ప్రకటనలో కోరారు.

డాక్టర్ వేణుకు అవార్డు



గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారానికి చెందిన హైదరాబాద్ ఉస్మానియా జనరల్ ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ (జనరల్ సర్జన్) డాక్టర్ గాదె వేణు రాష్ట్రీయ సేవా జాతీయ అవార్డు–2025ను అందుకున్నారు. ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ వారు ఈ అవార్డును ఆయనకు అందించి సన్మానించారు. డాక్టర్ వేణు నిరుపేద కుటుంబంలో పుట్టి ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం చదువుకున్నారు. ఆ తర్వాత ఎంబీబీఎస్, ఎంఎస్ పూర్తి చేశారు. గతంలో ఆయన వరంగల్ ఎంజీఎం, ఆదిలాబాద్, వరంగల్‌లోని పలు ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో వైద్యసేవలు అందించారు. తన స్వగ్రామంలో ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

హన్మకొండ: హనుమకొండ జిల్లాలో ఆదివారం మోస్తరు నుంచి తేలికపాటి వర్షం కురిసింది. నెల రోజులుగా వర్షాభావ పరిస్థితుల కారణంగా మెట్ట పంటల మొలకలు వాడిపోతున్న క్రమంలో కురిసిన వర్షం జీవం పోసింది. రాత్రి 10 గంటల వరకు ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లో నమోదైన వర్షపాతం వివరాలను ప్రణాళిక శాఖ విడుదల చేసింది. దామెర మండలం పులుకుర్తిలో 38.5 మిల్లీమీటర్లు, వరంగల్ పైడిపల్లి 34.5, కమలాపూర్ 30.8, శాయంపేట 29.3, వేలేరు 28.3, హసన్‌పర్తి 25.5, హనుమకొండ పెద్దమ్మగడ్డ 24.3, కాజీపేట మడికొండ 18.8, దామెర 17.3, కాజీపేట 17, నడికూడ 16, పరకాల 10.5, ఐనవోలు 10, హసన్‌పర్తి నాగారం 9.5, భీమదేవరపల్లి 9.3, ఆత్మకూరులో 8.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

మామూళ్ల మత్తు

'కమర్షియల్' నుంచి కాసుల పంట

- శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సహకారంతో జవాన్ల అక్రమ వసూళ్లు!
- యూజర్ చార్జీల వసూళ్లలో నిర్లక్ష్యం
- ఆదాయంపై పట్టించుకోని గ్రేటర్ అధికార, పాలక వర్గాలు
- నగరంలో ప్రజారోగ్యం పచ్చిమోసం!

సాక్షి ఫోకస్

- ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరించి, తరలించినందుకు విస్తీర్ణం ఎస్‌ఎఫ్‌టీల ఆధారంగా మూడు స్లాబుల్లో నెలకు రూ.60 నుంచి రూ.1,200 వరకు చెత్త పన్ను విధించి ఆస్తి, నీటి పన్నులో జోడించి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు.
- వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు నిత్యం రూ.వేలు, లక్షల్లో ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తుంటారు. భారీగా చెత్త వెలువడే కమర్షియల్ షాపుల నుంచి ప్రతినెలా యూజర్ చార్జీల సొమ్ము మాత్రం వసూలు చేయట్లేదు.

ఇలా.. గత 11 ఏళ్లుగా 5శాతం వరకు మాత్రమే కమర్షియల్ కాంప్లెక్స్‌ల నుంచి వసూలు చేస్తుండడంతో బల్దియాకు రావాల్సిన సుమారు రూ.10 కోట్ల పైచిలుకు ఆదాయానికి గండిపడింది.



పై ఫొటో హనుమకొండ చౌరస్తా సిటీ బస్టాప్ సమీపంలోది. రెండు కాంప్లెక్స్‌ల నడుమ ఒక మీటర్ ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో నిత్యం షాపుల నుంచి వెలువడే వ్యర్థాలను పడేస్తున్నారు. గుట్టలుగా చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఈగలు ముసురుకుంటున్నాయి. ఇది ఒక చౌరస్తాలో మాత్రమే కాదు. సిటీలోని చాలా కాంప్లెక్స్‌లలోని పరిస్థితి.

వరంగల్ అర్బన్: వరంగల్ నగరం అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది. జాతీయ, అంతర్జాయ సంస్థలు వెలిశాయి. నగరంలో షాపులు, హోటళ్లు, సినిమా హాళ్లు, రెస్టారెంట్లు ఉదయమే తెరుచుకుంటాయి. అప్పటికే వీధులు, రహదారులను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేసి వెళ్లిపోతారు. అతర్వాత షాపు యజమానులు వచ్చి దుకాణాలు తెరిచి శుభ్రం చేయగా.. వచ్చిన చెత్తాచెదారాన్ని తిరిగి షాపుల ఎదుట డ్రెయినేజీ, కాల్వలు, రహదారులపై పడేయడంతో నగరం అపరిశుభ్రంగా మారుతోంది. ఆస్పత్రుల స్థాయి ఆధారంగా, డయాగ్నొస్టిక్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, ఫంక్షన్ హాళ్లు, లాడ్జీలు, ప్రైవేట్ విశ్రాంతి భవనాలు, క్లబ్బులు, కూరగాయల, వ్యవసాయ మార్కెట్లకు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ప్రైవేట్ హాస్టళ్లు, హోల్‌సేల్ పండ్ల వ్యాపారులు, పెద్ద హోటళ్లు, మిడిల్ స్థాయి హోటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, వైన్ షాపులు, ఫంక్షన్ హాళ్లు ప్రతి నెలా వ్యర్థాల సేకరణకుగాను బల్దియాకు నిర్ణీత సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది.

యూజర్ చార్జీల వసూలేది?

ఆయా సంస్థలు, వ్యాపార కేంద్రాల నుంచి చెత్తాచెదారం వ్యర్థాలను తీసుకెళ్లేందుకు వాటి విస్తీర్ణం ఆధారంగా యూజర్ చార్జీలు వసూలు చేయాలనే ఆలోచన వరంగల్ బల్దియాకు 2013 సంవత్సరంలో వచ్చింది. ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేసి షాపుల నుంచి చెత్తను తరలించేందుకు యూజర్ చార్జీలను వసూలు చేయాలని నిర్ణయించారు. సర్వే చేసి 1,674 సంస్థలను గుర్తించారు. ఆయా సంస్థల నుంచి ఎంత వసూలు చేయాలో ఖరారు చేసి 2014 నుంచి వసూళ్ల ప్రక్రియ ప్రారంభించారు. రెండేళ్ల పాటు 50శాతానికి పైగా వసూలు చేసిన ప్రజారోగ్యం సిబ్బంది తదుపరి క్రమేపీ విస్మరిస్తున్నారు. తొలుత 1,674 వాణిజ్య సంస్థలు ప్రస్తుతం బల్దియా రికార్డుల్లో 427 కుచించుకుపోయాయి. ఈ ఏడాది చార్జీలు రూ.31 లక్షలు నిర్ణయించగా.. ఇప్పటి వరకు రూ.8 లక్షలు వసూలు చేసినట్లు లెక్కలు చెప్పడం అవినీతికి నిదర్శనంగా నిలుస్తోంది.

కంపు.. కంపు

బల్దియా సిబ్బంది నిర్లక్ష్యం.. అవినీతి కారణంగా కమర్షియల్ కాంప్లెక్స్‌లలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. నిత్యం షాపుల నుంచి వెలువడే చెత్తనంతా రెండు కాంప్లెక్స్‌ల నడుమ, కాంప్లెక్స్ చుట్టూ ఖాళీ స్థలాల్లో నింపేస్తున్నారు. మురుగు వాసన వస్తున్నా.. ఈగలు, దోమలు విజృంభిస్తున్నా అటు బల్దియా, ఇటు కాంప్లెక్స్‌ల యజమానులు, వ్యాపారులు పట్టించుకోవట్లేదు. వ్యాపార సముదాయాల నుంచి వెలువడే చెత్తను రోజూ బల్దియా వాహనాల్లో వేయాలంటే యూజర్ చార్జీలు చెల్లించాలి. ఇది ఇష్టం లేని కొందరు వ్యాపారులు ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు.



ఆ సొమ్ము ఎవరి జేబుల్లోకి..

గత పదిన్నరేళ్ల కాలంలో సుమారు రూ.10 కోట్లకుపైగా యూజర్ చార్జీల ద్వారా బల్దియా ఆదాయం సమకూరాలి. కానీ.. ఇంత వరకు ఎంత మంది వద్ద సొమ్ము వసూలు చేశారో, ఎవరు ఎగ్గొట్టారో చిక్కుముడిగా మారింది. వాణిజ్య సంస్థల నుంచి ప్రతీ నెల జవాన్లు యూజర్ చార్జీలను వసూలు చేయాలి. ఆన్‌లైన్ రశీదు ఇవ్వాలి. బల్దియా వద్ద లెక్కాపత్రం లేదు. వసూలు చేయాల్సిన కొంతమంది జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల సహకారంతో యూజర్ చార్జీలతో సంబంధం లేకుండా నెలవారీ మామూళ్లకు పాల్పడుతున్నారు. బార్ అండ్ రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, ఆస్పత్రులు, హాస్టల్స్, టిఫిన్ సెంటర్లు ఇలా ప్రతీ వాణిజ్య సంస్థకు మరీ లెక్కగట్టి చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. వసూలు చేసి బల్దియాకు చెల్లించాల్సిన సొమ్మును 90శాతం మందికిపైగా సిబ్బంది తమజేబుల్లోనే వేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వారు అడగరు.. వీరు ఇవ్వరు!

వ్యాపార, వాణిజ్య సంస్థల నిర్వాహకుల నుంచి వ్యర్థాలను తీసుకెళ్లే క్రమంలో ఎంతో కొంత, నెలవారీగా వసూలు చేస్తున్నారు. ఇందుకుగాను యజమానులు, వ్యాపారులు చెల్లించిన సొమ్ముకు రశీదులు అడగడం లేదు. వీరు ఇవ్వడం లేదు. బల్దియా ప్రజారోగ్య శాఖ అధికారులు, కమిషనర్లు యూజర్ చార్జీల వసూళ్లపై కనీసం సమీక్షలు, పురోగతిపై సమావేశాలు ఏర్పాటు చేయట్లేదు. దీంతో బల్దియా రికార్డుల్లో ప్రతి నెలా యూజర్ చార్జీల సొమ్ము భారీగా పేరుకుపోయింది. అనధికారిక వసూళ్లే అందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి. పాలకవర్గం పెద్దలు, నూతన కమిషనర్ ఈ సొమ్ము రాబట్టుకుంటారా? లేక వదిలేస్తారా? లేకపోతే శానిటరీ సిబ్బందిపై చర్యలు చేపడతారా? అనేది వేచి చూడాల్సిందే.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం..

వాణిజ్య సంస్థలను స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గుర్తిస్తాం. లోపాలను సరిచేసుకుంటాం. యూజర్ చార్జీలను నిబంధనల మేరకు వసూలు చేస్తాం.

- రాజేశ్, బల్దియా సీఎంహెచ్‌ఓ

వైభవంగా శాకంబరీ మహోత్సవాలు



శ్రీభద్రకాళి అమ్మవారు



కురుకుల్లా క్రమంలో అమ్మవారు



భేరుండా క్రమంలో..

హన్మకొండ కల్చరల్: శ్రీభద్రకాళి దేవాలయంలో వైభవంగా కొనసాగుతున్న శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం అమ్మవారికి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం, క్షీరాన్న నివేదన నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలమాలలతో శోభాయమానంగా అలంకరించారు. కాళీక్రమాన్ని అనుసరించి స్నపన భేరాన్ని కురుకుల్లా క్రమంలో, షోడశీక్రమాన్ని అనుసరించి భోగభేరాన్ని భేరుండాక్రమంలో అలంకరించి నవరాత్ర విశేషపూజలు నిర్వహించారు.

బ్యాంక్ డిపాజిట్లు రూ.219.20 కోట్లు

- వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ప్రదీప్‌రావు



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న బ్యాంక్ చైర్మన్ ప్రదీప్‌రావు

రామన్నపేట: వరంగల్ అర్బన్ కో–ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరంలో 14.24 శాతం వృద్ధితో డిపాజిట్లు రూ.219.20 కోట్లకు చేరాయని బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు వెల్లడించారు. నగరంలోని దేశాయిపేట రోడ్డులోని కేఆర్ గార్డెన్స్‌లో ఆదివారం బ్యాంక్ 29వ మహాజన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. రుణాల మంజూరులో 13.20 శాతం వృద్ధితో రూ154.13 కోట్లు కలిపి మొత్తం వ్యాపారం రూ.373.43 కోట్లకు చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఈఆర్థిక సంవత్సరంలో స్థూల లాభం రూ.3.03 కోట్లు కాగా అందులో రూ.60.90 లక్షల ఆదాయపు పన్ను చెల్లించగా నికరలాభం రూ.2.22 కోట్లు ఆర్జించినట్లు వెల్లడించారు. డిపాజిట్ దారులకు రిజర్వ్ బ్యాంకు నిబంధనల మేరకు డీఐసీజీసీ ద్వారా రూ.5 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. ఈఆర్థిక సంవత్సరంలో గోపాల్‌పూర్, మహబూబాబాద్, జనగాం, వడ్డేపల్లి నూతన శాఖలను ప్రారంభించనట్లు తెలిపారు. సమావేశంలో బ్యాంక్ వైస్ చైర్మన్ తోట జగన్నాథం, డైరెక్టర్లు వేణుగోపాల్ ముండడ, కూరపాటి చంద్రమౌళి, తోట సంపత్‌కుమార్, మహమ్మద్ గౌసొద్దీన్, ఒడితెల పవన్‌కుమార్, బొమ్మినేని పాపిరెడ్డి, పొన్న హరినాథ్, పోలేపాక రవికుమార్, బండారి భార్గవి, మంద స్వప్న, నామినేట్ డైరెక్టర్లు అప్పరాజు రాజేంద్రకుమార్, పుల్లూరి సుధాకర్, బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఎం.సత్యనారాయణరావు, వరంగల్, హనుమకొండ డీసీఓలు కోదండ రాములు, సంజీవరెడ్డి, ఏఆర్ అన్నమనేని జగన్మోహన్‌రావు, సేల్స్ ఆఫీసర్ కె.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మెనూ.. కడుపునిండా తిను!

- కస్తూర్బా ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యమైన ఆహారం

కాజీపేట: విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ప్రభుత్వ విద్యను మరింత బలోపేతం చేసే ఆలోచనలతో నూతన సంస్కరణల దిశగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసింది. కస్తూర్బా ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నూతన ఆహార పట్టిక అమలు చేయాలని ఆదేశాలను జారీ చేసింది. వారంలో అయిదు సార్లు కోడిగుడ్లు, నెలలో రెండు సార్లు మాంసం, రోజూ నెయ్యి వడ్డించాలని నిర్ణయించారు. నూతన వంటకాల తయారీకి అనుగుణంగా వంట మనుషులకు విద్యాశాఖ అధికారులు తగిన శిక్షణ ఇప్పించారు.

పెరిగిన మెస్ చార్జీలు

హనుమకొండ జిల్లాలో 9 కేజీబీవీలున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సరికొత్త రుచులతో వంటకాలు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు అనుగుణంగా మెస్‌చార్జీలను పెంచింది. గతంలో ఒక్కో విద్యార్థికి నెలకు మెస్ ఛార్జీ రూ.1,225 ఉండేది. ప్రస్తుతం రూ.1,740కి పెంచింది.

పర్యవేక్షణతో అమలు

ప్రభుత్వం ప్రత్యేక చొరవతో నూతన మెనూను రూపొందించింది. దీని అమలుకు కార్యాచరణ అమలుకు ఆదేశాలను జారీ చేసింది. జిల్లా, మండల అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు చేస్తేనే కొత్త ఆహార పట్టిక అమలకు నోచుకుంటుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.



మెనూ ఇలా..

- ఉదయం: అల్పాహారంలో టమాటా కిచిడీ, రాగిజావ, ఇడ్లీ, సాంబర్, పాలు (బూస్ట్), పూరి, పులిహోర, బోండా, ఉప్మా, చపాతీ, జీరా రైస్, అరటి పండు ఇవ్వాలి.
- మధ్యాహ్నం: అన్నంతో పాటు టమాటా పప్పు, నెయ్యి, రసం, పెరుగు, ఉడికించిన గుడ్డు, చికెన్, మటన్ ఇవ్వాలి.
- సాయంత్రం: ఉడికిన పెసలు, శనగలు, ఎగ్ బజ్జీ, బెల్లం పల్లీలు, అల్లం చాయ్, మిల్లెట్ బిస్కెట్లు, పకోడి
- రాత్రి: అన్నంతో పాటు వివిధ రకాల కూరలు, సాంబర్, మజ్జిగ ఇవ్వాల్సి ఉంటుంది.

'పంచాయతీ'కి ముందస్తు ఏర్పాట్లు

- లెక్కలు పక్కా చేస్తున్న సిబ్బంది

హన్మకొండ అర్బన్: ఇటీవల రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించడంతో యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు జిల్లా స్థాయిలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ముందుకు సాగుతున్నారు. తాజా లెక్కల ప్రకారం జిల్లాలో 210 గ్రామపంచాయతీలు, 12 మండల పరిషత్‌లు, 1,986 వార్డులు, అంతే సంఖ్యలో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ లెక్కలను కలెక్టరేట్లోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో అధికారులు సరిచేస్తున్నారు. గ్రామస్థాయి నుంచి పంచాయతీ కార్యదర్శులకు ఫోన్లు చేసి అవసరమైన సమాచారం సేకరిస్తున్నారు.



పంచాయతీ ఎన్నికల పనుల్లో నిమగ్నమైన డీపీఓ కార్యాలయ సిబ్బంది

మొత్తం ఓటర్లు 3,72,646

జిల్లాలోని గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 3,72,646 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,81,772 మంది పురుషులు, 1,90,872 మంది మహిళలు, ఇతరుల కేటగిరీలో ఇద్దరు ఓటర్లుగా నమోదై ఉన్నారు. గ్రామాల్లో 1,169 పోలింగ్ కేంద్రాల్లో 200కంటే తక్కువ మంది ఓటర్లు ఉన్నారు. 755 పోలింగ్ కేంద్రాల్లో 201నుంచి 400 మంది ఓటర్లు ఉన్నారు. 62 కేంద్రాల్లో 401 నుంచి 650 మంది వరకు ఉన్నారు. మొత్తం 1,986 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కాగా ఇప్పటికే బ్యాలెట్స్ ప్రింటింగ్, ఇతర స్టేషనరీ సిద్ధంగా ఉంది. జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంతం ఆదేశాలతో కార్యాలయ సిబ్బంది ఎన్నికలకు సంబంధించి ముందస్తు పనులు చేస్తున్నారు. ఈ విషయమై అధికారులను సంప్రదించగా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రానప్పటికీ, ముందస్తుగా పనులు చేస్తున్నట్లు తెలిపారు.

అమ్మవారికి పూజలు



కమిషనర్ చాహత్‌బాజ్‌పాయ్, వరుణ్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఈఓ తదితరులు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని ఆదివారం వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి దంపతులు సందర్శించారు. అర్చకులు భద్రకాళి శేషు, ఈఓ. శేషుభారతి, ధర్మకర్తల మండలి చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం వారికి ఆలయమర్యాదలతో స్వాగతించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగరంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం వరకు రాత పూర్వకంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, నగర ప్రజలు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మీసేవ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరి శంకర్



నియామక పత్రం అందుకుంటున్న అధ్యక్షుడు రమేశ్, సంయుక్త కార్యదర్శి గుగులోత్ సతీశ్

హన్మకొండ: మీసేవ ఆపరేటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. హనుమకొండ కేఎల్ఎన్‌రెడ్డి కాలనీలోని రాధ గ్రాండ్ బాంక్వెట్ హాల్‌లో ఆదివారం జరిగిన తెలంగాణ మీసేవ హనుమకొండ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసిన తర్వాత తహసీల్దార్ కార్యాలయాల్లో ఎలాంటి దరఖాస్తు చేయకూడదని సూచించారు. అనంతరం తెలంగాణ మీసేవ ఫెడరేషన్ హనుమకొండ జిల్లా కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా దేశిని రమేశ్, ప్రధాన కార్యదర్శిగా జక్కు రాజు, కోశాధికారిగా పేరాల సురేందర్, ఉపాధ్యక్షులుగా మాడిశెట్టి శ్యాంప్రసాద్, కొయ్యడ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా గుగులోత్ సతీశ్, గజ్జెల రమేశ్, సంయుక్త కోశాధికారులుగా నాంపల్లి ఆంజనేయులు, బండి కిరణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పుల్లూరు సునీల్, చెన్న విద్యాసాగర్, మీడియా ఇన్‌చార్జ్‌లుగా వేముల రాజేందర్, గూడూరు అనిల్‌కుమార్, మహిళా కోఆర్డినేటర్లుగా సామల రమాదేవి, కట్ల మమత, అధికార ప్రతినిధిగా చాట్ల రాజు ఎన్నికయ్యారు. సర్వసభ్య సమావేశానికి హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు బైరి శంకర్‌ను నూతన కార్యవర్గం సన్మానించింది.

నేడు మంజూరు పత్రాల పంపిణీ

వరంగల్ అర్బన్: వరంగల్ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు హనుమకొండలోని అంబేడ్కర్ భవన్‌లో సోమవారం మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 800 మందికి మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై ప్రొసీడింగ్స్ అందజేస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ఇప్పటికే మొబైల్ ఫోన్ ద్వారా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు స్వీకరించాలని బల్దియా అధికారులు సమాచారం అందజేసినట్లు కమిషనర్ పేర్కొన్నారు.

స్ట్రీట్ వెండర్లకు అండగా నిలుస్తాం..

- గ్రూపులకు బ్యాంకు రుణాలు ఇప్పిస్తాం
- ఫుడ్ ఫెస్టివల్‌లో మేయర్, ఎమ్మెల్యే

వరంగల్ అర్బన్: స్ట్రీట్ వెండర్లకు అండగా నిలుస్తామని నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. బల్దియా, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) సంయుక్త ఆధ్వర్యాన ఆదివారం భద్రకాళి బండ్‌లో ఏర్పాటు చేసిన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ (వీధి ఆహార విక్రయాదారుల వంట కళల ప్రదర్శన, అమ్మకం) కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. మధ్యాహ్నం 3 గంటలకు మొదలై రాత్రి 10 గంటల వరకు జరగాల్సిన కార్యక్రమం వివిధ కారణాలు, వర్షం కారణంగా 6 గంటలకు ప్రారంభమై రాత్రి 8.30 గంటలకు ముగిసింది. ఈసందర్భంగా మేయర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్ట్రీట్ వెండర్స్ గ్రూపులుగా ఏర్పడితే బ్యాంకు రుణాలను ఎలాంటి గ్యారెంటీ లేకుండా అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రభుత్వం పేద వర్గాలను అన్ని రకాలుగా ప్రోత్సహించేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. ఈసందర్భంగా 30 స్ట్రీట్ ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేయగా.. శుచి, శుభ్రత బాగుందని హాజరైన నగర ప్రజలు, అతిథులు అభినందించారు. కార్యక్రమంలో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, మెప్మా స్టేట్ కో–ఆర్డినేటర్ కృష్ణ చైతన్య, బల్దియా అడిషనల్ కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసూనరాణి, రవీందర్, రాజేశ్వర్‌రావు, సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి, టీఎంసీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

క్లుప్తంగా

2027 గోదావరి పుష్కరాలపై దృష్టి

- కాళేశ్వరంలో శాశ్వత నిర్మాణాలకు భూ సేకరణ

కాళేశ్వరం: జయశంకర్‌భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో 2027 సంవత్సరం జూలైలో నిర్వహించే పుష్కరాల నేపథ్యంలో గోదావరి నది తీరంలో భక్తులకు సౌకర్యాలు మెరుగు పర్చాలన్న సంకల్పంతో దేవాదాయశాఖ అడుగులు వేస్తున్నది. దక్షిణకాశీగా పిలువబడే కాళేశ్వరంలో నిర్మాణాలు చేపట్టేందుకు భూ సేకరణకు సంబంధించిన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. గోదావరి పుష్కరాల వరకు కాళేశ్వరంలో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలని దేవాదాయ శాఖ నిర్ణయించింది. నది తీరంలో పుష్కర ఘాట్లు, కాళేశ్వరంలో రోడ్ల నిర్మాణానికి సరస్వతీనది పుష్కరాల సమయంలో చేపట్టిన భూ సేకరణతో పాటు మరిన్ని భూములను సేకరించనుంది. ఇప్పటికే అధికారులు సర్వే చేశారు. ఈ మేరకు పలు సర్వే నంబర్లలోని 15 ఎకరాల భూమి సేకరణకు ఆలయ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత విభాగం ఉన్నతాధికారులకు పంపించగా అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. ఈవిషయమై ఈఓ మహేశ్‌ను సంప్రదించగా ఇటీవలే సర్వే చేశామని, పూర్తి వివరాలు జిల్లా అధికారుల వద్ద ఉన్నట్లు వివరించారు.

ములుగులో దొంగల హల్‌చల్..

ములుగు రూరల్: ములుగులో దొంగలు హల్‌చల్ చేశారు. జిల్లా కేంద్రంలోని రియాన్ వైన్స్ షాపు, రామాలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీకి పాల్పడినట్లు సీఐ సురేశ్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు. రియాన్ వైన్స్ షాపు షెటర్ పగులకొట్టి అందులో ఉన్న రూ. 35 వేల నగదు , రామాలయంలో హుండీలో సుమారు రూ. 20 వేలు ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. షాపు యజమాని, రామాలయం కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆధారాలు సేకరించామన్నారు. వైన్స్ షాపులోని సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకుంటామన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.



ఇంటర్ లింక్‌తో నిరంతర విద్యుత్

- వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన కరెంట్
- ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసిన టీజీఎన్పీడీసీఎల్

హన్మకొండ : విద్యుత్ అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో అంతరాయాలతో వినియోగదారులు ఇబ్బందులు పడొద్దనే లక్ష్యంతో టీజీ ఎన్పీడీసీఎల్ పెద్ద ఎత్తున ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్లు చేపట్టింది. ఇందులో భాగంగా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీని ద్వారా వినియోగదారులకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతుంది. దీని కోసం ప్రతీ సబ్ స్టేషన్ మధ్య ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ నిర్మించింది. తదనుగుణంగా 11 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ల వ్యవస్థపై కూడా దృష్టి సారించింది. అవసరమైన లైన్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించింది. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాలతో ఒక లైన్‌లో లేదా సబ్ స్టేషన్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన లేదా నిలిపివేయాల్సిన ఆవశ్యకత ఏర్పడితే ఆయా లైన్ లేదా సబ్ స్టేషన్ పరిధిలోగల విద్యుత్ 33 కేవీ ఇంటర్ లింక్ లైన్ వ్యవస్థ ఒక 33/11కేవీ సబ్ స్టేషన్ నుంచి మరో 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు, అదే విధంగా 33 కేవీ లైన్ నుంచి మరో 33 కేవీ లైన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందిస్తారు. దీంతో మరమ్మతులు చేసిన సమయంలో, మరే ఇతర కారణాల వల్ల ఒక లైన్‌లో విద్యుత్ సరఫరా చేస్తే ఆ ప్రాంత విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలు లేకుండా ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తారు.


విద్యుత్ సబ్ స్టేషన్

ఆరు ఇంటర్ లింకింగ్ లైన్ల నిర్మాణం పూర్తి..

వరంగల్ సర్కిల్ పరిధిలోని 33/11 కేవీ సబ్ స్టేషన్లు, 33 కేవీకి చెందిన 16 లైన్లలో ఇంటర్ లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 6 ఇంటర్ లింకింగ్ లైన్ల నిర్మాణం పూర్తి చేశారు. పది 33/11కేవీ సబ్ స్టేషన్లలో పనులు కొనసాగుతున్నాయి. హనుమకొండ సర్కిల్ పరిధిలోని డెబ్బై నాలుగు 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో అయిదు 33 కేవీ లైన్లలో ఇంటర్ లింకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో 72 సబ్ స్టేషన్లలో పనులు పూర్తయ్యాయి. మరో రెండు 33/11 కేవీ సబ్ స్టేషన్లలో పనులు కొనసాగుతున్నాయి. మూడు 33 కేవీ లైన్లులలో ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ల నిర్మాణం జరుగుతోంది.

వినియోగదారులకు నిరంతర విద్యుత్



వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాం. టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి ప్రత్యామ్నాయ లైన్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించారు. వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు.

– కె.గౌతం రెడ్డి, ఎస్ఈ, వరంగల్

ప్రత్యేక కార్యాచరణతో ముందుకు ..



వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన అంతరాయాలు లేని విద్యుత్ సరఫరాకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నాం. కొన్ని లైన్ల నిర్మాణానికి రైల్వే క్రాసింగ్‌ల వద్ద రైల్వే అధికారుల అనుమతి రావాల్సి ఉంది. ఈ మేరకు రైల్వే అధికారులను అనుమతి కోరాం.

– పి.మధుసూదన్ రావు, ఎస్ఈ, హనుమకొండ

‘కొండా’కు దమ్ముంటే కొత్త పార్టీ పెట్టాలి

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- మురళికి సురేందర్‌రెడ్డి ప్రాణభిక్ష పెట్టాడు
- వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య

హన్మకొండ చౌరస్తా: గత ఎన్నికల్లో పక్క నియోజకవర్గ ఎమ్మెల్యేలను తామే గెలిపించామని పదేపదే చెబుతున్న కొండా మురళీకి దమ్ముంటే కొత్త పార్టీ పెట్టాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో స్టేషన్‌ఘన్‌పూర్, వర్ధన్నపేట, పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్.నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ‘కుడా’ చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ సమావేశం అయ్యారు. అనంతరం స్వర్ణ, నాగరాజు, వెంకట్రామ్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్సీ సారయ్య మీడియాతో మాట్లాడారు. గత 38 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీని బతికించామని చెబుతున్న కొండా మురళికి రాజకీయ జన్మనిచ్చింది తెలుగుదేశం పార్టీ అన్నారు. పార్టీలు మారలేదంటున్న కొండా కుటుంబం అన్నీ పార్టీలు మారారని.. కాంగ్రెస్ పార్టీకి చేసిన పని ఏమిటో చెప్పాలని ప్రశ్నించారు. షోకాజ్ నోటీసు ఇస్తే హైదరాబాద్‌కు వెళ్లిన మురళి తననెవరూ పిలవలేదంటూనే క్రమశిక్షణ కమిటీకి తప్పుడు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ నాడు ప్రాణభయంతో రామసహాయం సురేందర్‌రెడ్డి వద్దకు వెళ్లిన కొండా మురళికి డీజీపీతో చెప్పి గన్‌మెన్లను ఇప్పించి ప్రాణభిక్ష పెట్టారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి గురించి మురళి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడని, ఎమ్మెల్యేలను కించపరిచేలా మాట్లాడడం సరికాదని హితవుపలికారు. జూలై 5 వరకు అధిష్టానం సమయం ఇచ్చిందని.. అప్పటి వరకు ఎదురుచూస్తామని అన్నారు. ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ మా మీద కొండా మురళి సవారీ చేయడం సరికాదని, తన గెలుపునకు ఎలాంటి సహాయం చేయలేదన్నారు. కొందరి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించి వేధించారని, అలాంటి పనులు చేయొద్దని కోరారు. ఎమ్మెల్యేలు రాజేందర్ రెడ్డి, శ్రీహరి మాట్లాడుతూ.. వచ్చే నెల 4న ఏఐసీసీ చీఫ్ ఖర్గే రాక నేపథ్యంలో జనసమీకరణ అంశంతో పాటు, వరంగల్ జిల్లా అభివృద్ధి, నిధుల సమీకరణపై సీఎం రేవంత్‌రెడ్డితో సమీక్ష నిర్వహించేందుకు ఆయన అపాయింట్‌మెంట్‌పై సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. కొండా మురళి వ్యాఖ్యలు, క్రమశిక్షణ కమిటీకి అందించిన నివేదికపై మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెబుతూ నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదన్నారు. అధిష్టానం ఇచ్చిన సమయంలో సరైన నిర్ణయం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దౌర్జన్యంగా విద్యుత్ స్తంభాల ఏర్పాటు

- మనస్తాపంతో పురుగుల మందు తాగిన మామిడితోట యజమాని
- మండలంలోని రాంపురం గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి..
- మరిపెడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టింపు కరువు

మరిపెడ రూరల్: మామిడితోట మధ్యలో ఓ వ్యక్తి రాత్రికిరాత్రే దౌర్జన్యంగా విద్యుత్ స్తంభాలు, తీగలు ఏర్పాటు చేశాడు. ఇది తెలిసిన తోట యజమాని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మరిపెడ మండలం రాంపురంలో ఇటీవల చోటు చేసుకోగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. బాధితుడి కుమారుడు రాజాకుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాడుగుల ఉపేందర్‌కు ఐదున్నర ఎకరాల్లో మామిడి తోట ఉంది. ఈ క్రమంలో తోట పక్కన గెట్టు ఉన్న అదే గ్రామానికి చెందిన చింతపల్లి మల్లయ్య మామిడితోట మధ్య నుంచి తన బోరు మోటారుకు విద్యుత్ కోసం ఈ నెల 19వ తేదీన అర్ధరాత్రి స్తంభాలు, తీగలు ఏర్పాటు చేశాడు. ఈ విషయం తెలిసి తోట వద్దకు వెళ్లిన ఉపేందర్ మనస్తాపానికి గురై అక్కడే గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సూర్యాపేటలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కాగా, చింతపల్లి మల్లయ్య .. విద్యుత్ అధికారుల అనుమతులు లేకుండా, తమకు తెలియకుండా మామిడి తోట మధ్య దౌర్జన్యంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశాడని ఉపేందర్ కుమారుడు రాజాకుమార్ తెలిపాడు. మా నాన్న ఉపేందర్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన మల్లయ్యపై చర్యలు తీసుకోవాలని కోరాడు. మల్లయ్యపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ నెల 19న తానే స్వయంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా కేసులో ఎలాంటి పురోగతి లేదని ఆరోపించాడు.


విద్యుత్ స్తంభాన్ని చూపుతున్న రాజాకుమార్





ఫైనాన్స్ వ్యాపారి హత్య కేసులో పోలీసుల ముందడుగు?

- మృతుడి బంగారం రూ. 6 లక్షలకు విక్రయించిన నిందితులు..
- అరెస్ట్‌కు రంగం సిద్ధం

కాజీపేట: కాజీపేట రైల్వే క్వార్టర్స్‌లో శనివారం జరిగిన ఫైనాన్స్ వ్యాపారి త్రిపురాధి నవీన్ కుమార్ హత్య కేసులో పోలీసులు ముందడుగు వేసినట్లు తెలుస్తోంది. ఏసీపీ పింగిళి ప్రశాంత్ రెడ్డి, సీఐ సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో రెండు పోలీసు బృందాలు నిందితుల ఆచూకీతో పాటు హత్య గల కారణాలను విశ్లేషించడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయని సమాచారం. హత్య శనివారం మధ్యాహ్నమే జరిగినట్లు నిర్ధారణకు రావడంతో పాటు అసలు ఎందుకు జరిగింది..డబ్బుల విషయంలో గొడవ కారణమా లేక మరేదైనా కోణం ఉందా అనే ఆలోచనలతో విచారణను వేగవంతం చేశారు. హత్య జరిగిన సమయంలో మృతుడి భార్య ఇంట్లోనే ఉందనే విషయాన్ని గుర్తించి కేసు మిస్టరీని బహిర్గతం చేయడానికి వేగంగా పావులు కదుపుతున్నారు. నిందితులు షెల్టర్ తీసుకున్న ప్రాంతాన్ని గుర్తించడమే కాకుండా వారి కదలికలపై నిఘా పెంచారు. ఒకటి, రెండు రోజుల్లో నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలుస్తోంది. నగరంలో వరుసగా హత్యలు జరుగుతుండడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని కేసును వెంటనే ఛేదించాలని ఆదేశించడంతో సిబ్బంది రాత్రి, పగలు తేడా లేకుండా విచారణలో నిమగ్నమయ్యారు.

మృతుడి ఆభరణాలు విక్రయం..

నవీన్‌కుమార్‌ను హత్య చేసిన తర్వాత నిందితులు అతడి శరీరంపై ఉన్న ఆభరణాలను దోచుకుని పరారయ్యారు. మృతుడి భార్య మాధవి తన భర్త శరీరంపై ఉన్న ఆభరణాల వివరాలు వెల్లడిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో కేసు నమోదు చేసిన పోలీసులు.. ఆభరణాలను నిందితులు ఎక్కడ విక్రయించి ఉంటారనే కోణంలో విచారణ చేపట్టగా వరంగల్ బట్టల బజారులో ఓ జ్యువెలర్ షాపులో విక్రయించి రూ. 6 లక్షల నగదు తీసుకున్నట్లు క్రైం పార్టీ పోలీసులు పూర్తి సమాచారం సేకరించి జిల్లా ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలుస్తోంది. బంగారం విక్రయించిన సమయంలో నిందితుడు గడ్డం ప్రవీణ్‌కుమార్‌తో భార్య ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఈ కేసులో ఇద్దరి ప్రమేయం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సీఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బృందం మరోమారు ఆదివారం రైల్వే క్వార్టర్స్‌కు చేరుకుని హత్య జరిగిన గదిని సమగ్రంగా పరిశీలించింది. హత్యకు ఉపయోగించిన ఆయుధంతో పాటు ఇతర ఆధారాలు సేకరించారు. పోలీసుల అదుపులో నిందితులున్నట్లు ప్రచారం జరుగుతున్నా అదేమీ లేదని, ఆ ప్రచారం ఊహాగానమేనని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. నిందితులు ఎక్కడికెళ్లినా అరెస్ట్ చేయడం ఖాయమని, ఒకటి, రెండు రోజుల్లో అన్ని విషయాలు వెల్లడిస్తామని వారు పేర్కొంటున్నారు.

రంగంలోకి రైల్వే అధికారులు..

రైల్వే క్వార్టర్స్‌లో ఫైనాన్స్ వ్యాపారి హత్య జరిగినట్లు వెల్లడికావడంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ, విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నారు. మృతుడు నవీన్‌కుమార్ రైల్వే క్వార్టర్స్‌కు ఎందుకు వచ్చాడు..?ఎప్పుడు హత్య జరిగింది..?ఇందులో రైల్వే ఉద్యోగుల పాత్ర ఏమిటనే విషయాలపై ఆరాతీస్తున్నారు. క్వార్టర్స్‌లో ఉన్న మిగతా ఉద్యోగులతో పలు అంశాలపై అధికారులు చర్చించినట్లు సమాచారం. ఈ కేసులో రైల్వే ఉద్యోగుల పాత్ర వెల్లడైన తర్వాతే శాఖపరమైన విచారణ జరిపించి తుది దశ చర్యలు చేపట్టాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే రైల్వేకు సంబంధించిన పలు శాఖల అధికారులు తమ నివేదికలను సంబంధిత అధికారులకు నివేదించినట్లు సమాచారం.

భూ వివాదంతో రైతు ఆత్మహత్య


మోహన్ (ఫైల్)

గార్ల: భూ వివాదంతో మనస్తాపం చెందిన ఓ రైతు.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఆదివారం పెద్దకిష్టాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగావత్ మోహన్ (38) అదే గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద 3 ఏళ్ల క్రితం భూమి కొనుగోలు చేశాడు. ఈ భూమిని పట్టా చేసుకునేందుకు మోహన్ పలుమార్లు విక్రయించిన రైతు వద్దకు వెళ్లాడు. అయితే ఆ వ్యక్తి పట్టా చేయడానికి రెవెన్యూ కార్యాలయానికి రావడం లేదు. ఈ సమస్య 3 ఏళ్లుగా కొనసాగుతోంది. దీంతో భూమి తన పేరుపై ఇంకా పట్టా కావడం లేదనే మనస్తాపంతో మోహన్ శనివారం రాత్రి తన పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రుడిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రియాజ్‌పాషా తెలిపారు.

డ్రైవర్ నిర్లక్ష్యానికి ఒకరి బలి..

- ట్రాలీ ఆటో ఢీకొని యువకుడు దుర్మరణం
- అయోధ్య క్రాస్ వద్ద ఘటన


అరుణ్ (ఫైల్)


మహబూబాబాద్ రూరల్ : ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యం ఒకరి ప్రాణాన్ని బలితీసుకుంది. వాహనం నిర్లక్ష్యంగా నడుపుతున్న క్రమంలో వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఓ యువకుడు ఆ ఆటోను ఢీకొని దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం మహబూబాబాద్ మండలం అయోధ్య క్రాస్ వద్ద చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపిక కథనం ప్రకారం.. మహబూబాబాద్ మండలం ముడుపుగల్‌కు చెందిన సుంద రవి (లేట్), రమ దంపతుల పెద్ద కుమారుడు అరుణ్ అలియాస్ టాకిల్ (20) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఉదయం తన ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వస్తున్నాడు. అంతకంటే ముందు అయోధ్య గ్రామానికి చెందిన కన్నం విజయ్ తన టాటా ఏస్ ట్రాలీ ఆటోలో ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆటో అయోధ్య క్రాస్ వద్దకు చేరుకోగానే ఇండికేటర్ వేయకుండా వాహనాన్ని అలాగే నడిపాడు. అంతలోనే ఆ వాహనం వెనకే వస్తున్న ద్విచక్రవాహనదారుడు అరుణ్ ఒక్కసారిగా ఆటోను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో అరుణ్ ద్విచక్ర వాహనం పైనుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలిని సందర్శించి ఆటోను అదుపులోకి తీసుకుని అరుణ్ మృతదేహాన్ని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం గదికి తరలించారు. మృతుడి బాబాయ్ సంద రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై దీపిక తెలిపారు.

ఇంటి నుంచి బయలుదేరిన పది నిమిషాల్లోనే..

అరుణ్ ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన పది నిమిషాలలోపే ఆటోను ఢీకొని దుర్మరణం చెందాడు. దీనిపై గ్రామస్తులు బోరున విలపించారు. అరుణ్ అప్పటిదాకా తమ ముందే కనబడి అంతలోనే కానరానిలోకాలకు వెళ్లిపోవడంతో ముడుపుగల్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. రెండేళ్ల క్రితం తండ్రి రవి అనారోగ్యంతో మృతిచెందగా కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న పెద్ద కుమారుడు అరుణ్ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో తల్లి రమ రోదించిన తీరు అందరి హృదయాలను కలచివేసింది.

బైక్‌పైనుంచి పడిన మహిళ..

- చికిత్స పొందుతూ మృతి


రాజమణి (ఫైల్)

చిట్యాల: ద్విచక్రవాహనంపై నుంచి పడిన ప్రమాదంలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాలలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చింతకింది రాజమణి (57) పని నిమిత్తం బైక్‌పై ఈనెల 27న రేగొండ మండలం కాకర్లపల్లెకు వెళ్తోంది. ఈ క్రమంలో తిర్మలాపూర్‌లో పంది అడ్డు వచ్చింది. దీంతో కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఆదివారం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు. మృతురాలికి భర్త రవీందర్, కుమారుడు రామకృష్ణ ఉన్నారు.

ఫోన్ ట్యాంపరింగ్‌లో దయాకర్‌రావు

- ఆయన జైలుకు వెళ్లడం ఖాయం
- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

హసన్‌పర్తి: ఫోన్ ట్యాంపరింగ్‌లో మాజీ మంత్రి దయాకర్‌రావు ప్రమేయం ఉందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్.నాగరాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. గ్రేటర్ వరంగల్ ఒకటో డివిజన్ పరిధిలో రూ.1.78కోట్లతో నిర్మిస్తున్న సీసీరోడ్ల పనులకు నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పర్వతగిరి కేంద్రంగా ఫోన్ ట్యాంపరింగ్ జరిగిందని, ఇందుకు స్పష్టమైన ఆధారాలు లభ్యమైనట్లు చెప్పారు. ఫోన్ ట్యాంపరింగ్‌లో దయాకర్‌రావు జైలుకు వెళ్లడం ఖాయమని, ఆయనకు చిన్న మెదడు చిట్లి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడన్నారు. వర్ధన్నపేట కేంద్రంగా వంద ఎకరాల్లో యంగ్‌ఇండియా ఇంటిగ్రేడెడ్ స్కూల్‌తో పాటు సబ్‌జైలు, మున్సిఫ్ కోర్టు, స్టేడియం నిర్మించడానికి ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. వర్ధన్నపేట ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు కొనసాగిన దయాకర్‌రావు అక్కడ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి ఏడాదిన్న కాలంలోనే అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని అన్నారు. సమావేశంలో కార్పొరేటర్ అరుణకుమారి, మాజీ సర్పంచ్ దేవరకొండ అనిల్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, మాజీ వార్డు సభ్యుడు గడ్డం శివరాంప్రసాద్, ఎన్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బురద అంటకుండానే వరిసాగు..

- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి


ఎద పద్ధతిలో దుక్కిలోనే సీడ్ డ్రిల్లర్‌తో వరి విత్తనాలు వేస్తున్న రైతు

దుగ్గొండి : వరి సాగులో ప్రస్తుతం పెట్టుబడి పెరగడంతోపాటు కూలీల కొరత రైతులను వేధిస్తోంది. పంట చేతికొచ్చాక గిట్టుబాటు ధర లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి తరుణంలో అతి తక్కువ పెట్టుబడితో ఎక్కువ నీరు అవసరం లేకుండానే బురద అంటకుండా అధిక దిగుబడి సాధించేలా వరి సాగు విధానాన్ని శాస్త్రవేత్తలు అందుబాటులోకి తీసుకొచ్చారు. దమ్ము చేయకుండా నేరుగా దుక్కిలోనే వరి విత్తనాలు వేసి సాగు చేసే విధానాన్ని వరంగల్ వ్యవసాయ పరిశోధన స్థానం సీనియర్ శాస్త్రవేత్త నాగభూషణం వివరించారు.

దుక్కి తయారీ..

పొలాన్ని లేదా మెట్ట భూమిని కల్టివేటర్‌తో మొదట రెండు సార్లు దున్నిన అనంతరం రోటోవేటర్‌తో చదును చేయాలి. తదనంతరం సీడ్ డ్రిల్లర్, ఫెర్టికమ్ సీడ్ డ్రిల్లర్ యంత్రంతో విత్తనాలు వేయాలి.

అనువైన రకాలు..

ఉత్తర తెలంగాణ ప్రాంతానికి దీర్ఘకాలిక రకాలైతే సాంబమసూర, సిద్ధి, మధ్య కాలిక రకాలైతే జగిత్యాల వరి, పోలాస ప్రభ, వరంగల్ సన్నాలు, వరంగల్ సాంబ, విజేత, భద్రకాళి, స్వల్ప కాలిక రకాలైతే తెలంగాణ సోన, కూనారం సన్నాలు అనుకూలం.

నాటే సమయం..

దీర్ఘకాలిక రకాలైతే జూన్ 10 నుంచి 30 వరకు, మధ్యకాలికం జూన్ 30 నుంచి జూలై 10 వరకు, స్వల్పకాలికం జూలై 10 నుంచి జూలై 30 వరకు విత్తుకోవచ్చు..

విత్తన మోతాదు..

సన్నగింజ రకాలైతే ఎకరాకు 8 నుంచి 10 కిలోలు, దొడ్డు గింజ రకాలైతే 10 నుంచి 12 కిలోలు సరిపోతాయి. సాలుకు సాలుకు మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 6 నుంచి 8 సెంటీమీటర్ల దూరం ఉండాలి.. విత్తనాలను ట్రాక్టర్ సాయంతో పనిచేసే సీడ్ డ్రిల్లర్ లేదా ఫర్టికమ్ సీడ్ యంత్రం సాయంతో విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం..

ఎకరాకు 48 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ నిచ్చే ఎరువులు వేయాలి. మొదట 20 కిలోల భాస్వరం, 8 కిలోల పొటాష్‌ను ఆఖరి దుక్కిలో వేయాలి. నత్రజని ఎరువును మూడు సమపాళ్లుగా విభజించి విత్తిన 15 నుంచి 20 రోజులకు, పిలక, అంకురం దశల్లో వాడుకోవాలి. చివరి దశలో వేసే నత్రజనితో పాటు 8 కిలోల పొటాష్‌ను తప్పనిసరిగా వేయాలి.

కలుపు నివారణ..

వరిలో 45 రోజుల వరకు ఎలాంటి కలుపు లేకుండా చూసుకోవాలి. కలుపుపై అశ్రద్ధ చేస్తే దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉంది. విత్తిన వెంటనే తేమ ఉన్న సమయంలో 48 గంటలలోపు ఎకరాకు లీటర్ పెండిమిథాలిన్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి భూమి తడిచేలా పిచికారీ చేయాలి. 20 రోజుల వయసులో ఎకరాకు బిస్‌పైరిబాక్ సోడియం 120 మిల్లీలీటర్ల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి. లేదా వీడర్ సాయంతోనూ కలుపును నివారించుకోవచ్చు.

ఇనుపదాతు లోపం..

ఎద పద్ధతిలో సాగుచేసే వరిలో ఇనుపదాతు లోపం ఏర్పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో లీటర్ నీటికి 5 గ్రాముల అన్నబేది, 1 గ్రాము నిమ్మ ఉప్పు కలిపి పంటపై 2–3 సార్లు పిచికారీ చేయాలి. చీడపీడల ప్రభావం పెద్దగా ఉండదు. ఉన్నా మామూలు వరిపై పద్ధతులనే పాటించాలి.

నీటి యాజమాన్యం..

తొలకరి వర్షాలు పడగానే వాటిని ఉపయోగించుకుని ఎద పద్ధతి వరిసాగు చేసుకోవడం లాభదాయకం. తొలకరి వర్షాలకు వరి విత్తనాలు విత్తితే జూన్, జూలై, ఆగస్టు మాసాల వరకు వర్షాలే సరిపోతాయి. ఆ తర్వాత 15 రోజుల వరకు వర్షాలు లేకుంటే ఆరుతండి పంటకు మాదిరిగా నీటి తడులివ్వాలి. పూత దశనుంచి గింజ గట్టిపడేవరకు పొలంలో అంగుళం మేర నీరు ఉండేలా చూసుకోవాలి..

ఖర్చులు.. ఆదాయం..

సాధారణ పద్ధతిలో వరి సాగుకు నారుమడి, విత్తనం, దమ్ము చేయడం, చదునుచేయడం, కూలీ లు, అధిక నీరు ఇలా చాలా పెట్టుబడి అవుతుంది. ఎద పద్ధతిలో అయితే ఎకరాకు రూ. 10 వేల పెట్టుబడి తగ్గుతుంది. దిగుబడి సాధారణం కంటే ఎక్కువే వస్తున్న నేపథ్యంలో ఎకరాకు రూ. 15 వేల అదనపు ఆదాయం సాధ్యమవుతుంది.

దిగుబడి ..

వర్షాకాలంలో ఎకరాకు 35 నుంచి 40 బస్తాలకు తగ్గకుండా దిగుబడి వస్తుంది. సాధారణ పదధతిలోని వరికంటే 3 నుంచి 5 బస్తాల అధిక దిగుబడి వస్తుంది.